బాబోయ్.. గ్రామ సింహాలు

- పీహెచ్‌సీల్లో పెరుగుతున్న యానిమల్ బైట్స్ కేసులు
- పిల్లి, కోతి, కుక్క కాట్లకు గురవుతున్న బాధితులు
- గత నెలలో పెడనలోని 9 పీహెచ్‌సీల్లో 264 కేసులు...
- ఈ నెల ఇప్పటికే 85
- అత్యధికంగా పెడనలో నమోదు


పెడనలోని ఒక వీధిలో కుక్కల గుంపు

పెడన: వీధి కుక్కలంటేనే పాదచారులు, వాహనచోదకులు బాబోయ్ అంటున్నారు. ఇటీవల జంతువులు కాట్లతో పీహెచ్‌సీలకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. వీటి కాట్లతో వ్యాధులు వస్తాయనే ఆందోళనతో ప్రజలు పీహెచ్‌సీ డాక్టర్లను సంప్రదించి చికిత్స తీసుకుంటున్నారు. అంతకు ముందు వరకు కుక్కకాట్లకు గురైన వారు అధికంగా ఉంటే ఇప్పుడు తాజాగా కోతి, పిల్లికాట్లకు గురైన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. పెడన నియోజకవర్గంలోని తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పిల్లి, కుక్క, కోతుల కారణంగా గాయపడిన వారి సంఖ్య పరిశీలిస్తే సెప్టెంబరులో 264 కేసులు నమోదయ్యాయి. ఈ నెల 8వ తేదీ వరకు 85 కేసులు నమోదు అయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గ్రామ సింహాల దాడే కాకుండా, పెంపుడు పిల్లుల కారణంగా గాయపడిన వారు సైతం ఉన్నారు. కోతుల బెడద ఎక్కువగా ఉండటం పారదోలే క్రమంలో వాటి బారిన పడుతున్న వారి సంఖ్య కూడా అధికమవుతోంది. పిల్లులు, కోతులు బారిన పడినవారు అత్యధికంగా పెడన పీహెచ్‌సీ పరిధిలోనే ఉండటం గమనార్హం. కోతులతో గాయపడుతున్న వారు పెడన మండలం కొంకేపూడికి చెందిన వారే. పిల్లులు బారిన పడుతున్న వారు పెడన పట్టణానికి చెందిన వారు కావడం ఆందోళన కలిగిస్తోంది. కుక్కల బారిన పడుతున్న వారు పెడన పరిసర ప్రాంతాలకు చెందిన వారున్నారు. పిల్లి, కుక్క, కోతులు చేసిన గాయాలకు ఒకటే వ్యాక్సిన్. రేబిస్ వ్యాధి సోకకుండా వేసే యాంటి రేబిస్ వ్యాక్సిన్. ఇది అందుబాటులో ఉన్నా జంతువుల కారణంగా గాయాలకు గురవుతుండటం ఆందోళన పడాల్సిన విషయమని వైద్యులు పేర్కొంటున్నారు.

పీహెచ్‌సీల్లో కేసుల సంఖ్య ఇలా

ఆయా పీహెచ్‌సీల్లో నమోదైన కేసులను పరిశీలిస్తే...పెడన పీహెచ్‌సీల్లో సెప్టెంబరులో 93 కేసులు నమోదు కాగా అక్టోబరు 8వ తేదీ వరకు 38 కేసులు నమోదయ్యాయి. చేవేంద్రలో 21, 08, పెడన అర్బన్ హెల్త్‌సెంటర్‌లో 7, 1, గూడూరు మండలం మల్లవోలులో 23, 7, బంటుమిల్లి మండలం బంటుమిల్లి పీహెచ్‌సీలో 30, 0, పెదతుమ్మిడి 16, 5, కృత్తివెన్ను మండలం కృత్తివెన్ను పీహెచ్‌సీలో సెప్టెంబర్‌లో 24, అక్టోబర్‌లో 10 కేసులు నమోదయ్యాయి. లక్ష్మీపురంలో 23, 12, చినపాండ్రకలో 27, 4 కేసులు నమోదయ్యాయి.


పెడన పీహెచ్‌సీ

ఎప్పుడూ లేదు... ఆందోళనకర విషయం



యానిమల్ బైట్స్ కేసులు ఎప్పుడూ లేని విధంగా పెరుగుతున్నాయి. కుక్కలతో గాయపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, వాటిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు తెలియజేశాం. ఇటీవల కోతులు, పిల్లులు కూడా కరుస్తున్నాయంటూ వస్తున్నారు. ఎప్పుడూ లేదు. యానిమల్ బైట్ కేసులు బాగా పెరిగాయి. యూపీహెచ్‌సీ వారే కాకుండా పక్క మండలాల నుంచి కూడా ఇక్కడికే వస్తున్నారు.

–డాక్టర్ పర్వేజ్‌హైదర్, పీహెచ్‌సీ వైద్యాధికారి,

నేడు నాగాయలంకలో తెలంగాణ బతుకమ్మ సంబరం



నాగాయలంక: దివిసీమలోనే ప్రప్రథమంగా గతేడాది నిర్వహించిన తెలంగాణ తెలుగు ప్రజల, ప్రధానంగా ఆడపడుచుల సంప్రదాయ గుండె చప్పుడైన బతుకమ్మ సంబరానికి నాగాయలంక మరోసారి వేదిక కాబోతుంది. గతేడాది పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి బతుకమ్మ వేడుకను దిగ్విజయం చేసిన ఉత్సాహంతో గురువారం కృష్ణానది ఒడ్డున శ్రీరామపాద క్షేత్రం ఘాట్‌లో వేడుక చేపట్టినట్లు క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, క్షేత్రపాలకుడు తలశిల రఘుశేఖర్, ఇతర సభ్యులు బుధవారం విలేకరులతో చెప్పారు. గ్రామంలోని బోస్‌బొమ్మ సెంటర్ నుంచి బతుకమ్మలను ధరించిన మహిళలతో ప్రదర్శన ఆటపాటలతో, మెయిన్ రోడ్డు, ఫెర్రీ రోడ్ ప్రసన్న గణపతి దేవస్థానం మీదుగా పుష్కర ఘాట్‌కు చేరుకుంటారు. వేడుక అనంతరం బతుకమ్మలను కృష్ణానదిలో నిమజ్జనం చేస్తారని వివరించారు. తెలంగాణ సంప్రదాయ సంస్కృతిని దివిసీమ తెలుగు ప్రజలకు పరిచయం చేయాలనే సంకల్పంతో మరోసారి కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

క్లుప్తంగా

చల్లపల్లి రైతుబజార్‌లో క్యాంటీన్‌కు వేలం

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి రైతు బజార్‌లో క్యాంటీన్ కోసం వేలంపాట నిర్వహించనున్నట్టు ఎస్టేట్ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలానికి ఈనెల 15న మచిలీపట్నంలోని మార్కెటింగ్ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రూ.10 వేలు డిపాజిట్‌తో ఈ నెల 13వ తేదీలోపు చల్లపల్లి రైతుబజార్ ఎస్టేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పెందుర్రులో.. పొలం పిలుస్తోంది

బంటుమిల్లి: పెందుర్రులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయ శాఖాధికారి జి. శివరామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన అవగాహన సదస్సులో బంటుమిల్లి, డీఆర్‌సీ ఏడీఏలు బి. గౌతమ్, శ్రీనివాసరావులు రైతులకు పలు విషయాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం అధికారులు పొలాలను పరిశీలించి సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు.

పరామర్శ

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న నాయకులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం పరామర్శించారు. పెదప్రోలులో ప్రముఖ పారిశ్రామిక వేత్త సబ్బినేని బుచ్చిరామయ్యను, మెరకనపల్లిలో మాజీ సర్పంచ్ కర్రా వెంకటేశ్వరరావును పరామర్శించి త్వరగా కోలువాలని ఆకాంక్షించారు. చిరువోలు ఎస్సీకాలనీలో ఇటీవల మృతి చెందిన యన్నా భిక్షాలు, పాగోలు కస్తూరి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వీఆర్వో నాంచారయ్య మృతి



బంటుమిల్లి: కంచడం వీఆర్వోగా పనిచేస్తూ ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయిన వీఆర్వో సీహెచ్ నాంచారయ్య(46) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యానికి గురై మరణించారు. ఆయన స్వగ్రామం ముదినేపల్లి మండలం, వాడవల్లిలో బుధవారం తెల్లవారుజామున నిద్రలేచిన నాంచారయ్య ఇంటి బయట రక్తంతో వాంతి చేసుకుని అక్కడే కుప్పకూలాడు. కొంతసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు అప్పటికే నాంచారయ్య మరణించినట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న బంటుమిల్లి తహసీల్దార్ భరత్‌రెడ్డి, డీటీ పూర్ణచంద్రరావు, ఆర్ఐ శంకర్, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది నాంచారయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇదిలా ఉంటే ఈ నెల 17న కుమార్తె వివాహం పెట్టుకుని పెళ్లి ఏర్పాట్లలో ఉన్న నాంచారయ్య మృతి కుటుంబ సభ్యులకు తీవ్రమనోవేదన మిగిల్చిందని రెవెన్యూ అధికారులు విచారం వ్యక్తం చేశారు. మృతుడు నాంచారయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పంట పొలాలను నాశనం చేస్తున్న ఎలుకలను నిర్మూలించేందుకు రైతులంతా సామూహికంగా మందు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లి, అడపావారిపాలెంలో బుధవారం ఎలుకల మందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా కిరణ్ కాంత్, ఆయా గ్రామ వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

విధులపై అవగాహన పెంచుకోవాలి

ఘంటసాల: ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు విధులు, నిధులపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు, ఇద్దరు వార్డు సభ్యులకు మండల స్థాయి శిక్షణను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ట్రైనర్స్ పాల్గొన్నారు. మోపిదేవి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రావి దుర్గా వాణి అధ్యక్షతన రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగనుంది. ఒక్కొక్క పంచాయతీ నుంచి ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి కళాశాలలో దసరా సంబరాలు

పెడన: నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కాలేజీలో దసరా సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సరస్వతి తల్లి విగ్రహం వద్ద సరస్వతీ పూజ, మెకానికల్ ల్యాబ్‌లో ఆయుధ పూజలను చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా ఆహూతులను అలరించాయి. కార్యక్రమాలు అనంతరం రావణ ప్రతిమను దహనం చేయడంతో సంబరాలు ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో కళాశాల చైర్మన్ జీఎం ప్రసాద్, సెక్రటరీ మెహెర్ బాబా, కరెస్పాండెంట్ కుమార్ బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

15 టన్నుల ఎరువుల విక్రయం నిలిపివేత

నాగాయలంక: వ్యవసాయ శాఖాధికారులు నాగాయలంకలో బుధవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వరి పొలాలకు ఏ మాత్రం ప్రయోజనకారి కాని మిశ్రమ ఎరువులను వ్యాపారులు అధిక ధరలకు విక్రయించడంపై 'మిశ్రమ ఎరువులతో నష్టపోతున్న రైతన్నలు' శీర్షికతో 'సాక్షి' ప్రచురించిన కథనంపై వ్యవసాయ శాఖాధికారులు స్పందించారు.

సాక్షి ఎఫెక్ట్

అవనిగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకురాలు జె.ఎస్ జయప్రద, మండల వ్యవసాయాధికారిణి(ఇన్‌చార్జ్)టి.శుభహారిక ఎరువుల షాపుల్లో తనిఖీలు చేసి లైసెన్స్‌లు, స్టాక్ రిజిస్టర్లు, డిస్‌ప్లే బోర్డులు, ఇన్వాయిస్‌లు, గోదాములలో స్టాక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయిదు షాపుల్లో తనిఖీలు చేశామని, దుకాణాల లైసెన్స్‌ల్లో ఫారం-ఓ నమోదు చేయించకపోవడంతో రూ.4,10,000 విలువైన 10టన్నుల 20-20-013 ఎరువు, అయిదు టన్నుల 14-35-14ఎరువుల అమ్మకాలు ఆపాలని ఆదేశించామని మిశ్రమ ఎరువులు లభించలేదని జయప్రద పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ 8మండల ఎరువుల డీలర్‌లతో సమావేశమై ఎఫ్‌సీఓ-1985చట్టం ప్రకారం పలు సూచనలు చేశామని, ప్రతి రైతుకు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని, ఈపాస్‌లో అమ్మకాలు నమోదు చేయాలని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎరువుల డీలర్లను హెచ్చరించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా ఈ సమావేశంలోనే తనిఖీలకు వస్తున్నట్లు డీలర్లకు ముందుగానే సమాచారం ఇచ్చి బుధవారం రావడం విడ్డూరంగా ఉందని, నాగాయలంకలో 9 షాపులు ఉండగా మిశ్రమ ఎరువు విక్రయించే దుకాణాల జోలికి అసలు వెళ్లకుండా నామ మాత్రంగా కేవలం వేరే 5 షాపులలో మాత్రమే సాధారణ తనిఖీలు జరిపినట్లు డీలర్లే బహిరంగంగా చెప్పకుంటున్నారు.


నాగాయలంకలో ఓ ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

విద్యుత్ విజిలెన్స్ దాడులు

నాగాయలంక: మండలంలోని గృహ, వాణిజ్య, ఆక్వా చెరువుల వినియోగదారుల సర్వీసులపై బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆల్ఫాన్ నేతృత్వంలో 29 బృందాలుగా ఏర్పడి 2,191 గృహ సర్వీసులు, 180 వాణిజ్య, ఇతర సర్వీసులను తనిఖీ చేశారు. తర్వాత నాగాయలంక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆల్ఫన్ మాట్లాడుతూ తనిఖీలు జరిపిన వాటిలో 255 సర్వీసులకు అదనపు లోడు 321కె.డబ్ల్యూ మొత్తానికి రూ.7,12,800 జరిమానా విధించినట్లు తెలిపారు. విజిలెన్స్ తనిఖీల్లో విద్యుత్ ఈఈ(ఉయ్యూరు)డి. కృష్ణనాయక్, అవనిగడ్డ డీఈఈ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, స్థానిక ఏఈ(ఇన్‌చార్జ్) జి.వెంకటరాజు, ఉయ్యూరు డివిజన్ పరిధిలోని పలువురు ఏఈలు, జేఈలు, ఎల్.ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



మచిలీపట్నంటౌన్: దసరా సందర్భంగా మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏపీటీఎఫ్ భవనంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సరస్వతీదేవి చిత్రాలను గీశారు. చిత్రలేఖనంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను స్టార్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పేర్నేటి శ్రీరామ్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు బీఎస్వీ రమేష్, ఉపాధ్యాయుడు ఎ సుబ్రహ్మణ్యం, ఆర్ట్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థిని గీతికాప్రియ పెయింటింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి లభించిందని స్కూల్ డైరెక్టర్ కిషోర్ తెలిపారు.

తపాలా ఉద్యోగుల ర్యాలీ

ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద పోస్టల్ సిబ్బంది ఫిట్ పోస్ట్ – ఫిట్ ఇండియా నినాదంతో ర్యాలీ నిర్వహించారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా అంత్యోదయ దివస్ సందర్భంగా ర్యాలీ జరిగింది. –మచిలీపట్నంటౌన్



డివిజన్లలో జెడ్పీ డిప్యూటీ సీఈవో



సుందర మచిలీపట్నంలో భాగంగా 1 నుంచి 10వ డివిజన్‌లకు సంబంధించి ప్రత్యేక అధికారిగా జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్‌సి ఆనంద్‌కుమార్ బుధవారం పర్యటించారు. పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. –మచిలీపట్నంటౌన్

భవానీశక్తి సన్నిధిలో కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లిలో శ్రీ కాళికా భవాని శక్తి ఆలయంలో వేంచేసి ఉన్న శక్తి అమ్మవారిని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) బుధవారం దర్శించుకున్నారు. మూల నక్షత్రం కావడంతో ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులతో పాటు పేర్ని కిట్టు అమ్మవారిని దర్శించుకుని పూజించారు. అనంతరం గుడి సమీపంలోని శక్తిపట ప్రదర్శనలో శక్తిపటానికి నమస్కరించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కార్పొరేటర్ తిరుమలశెట్టి వరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు గౌర శ్రీహరి, భగవాన్, భానుతేజ, రాజా తదితరులు ఉన్నారు.


శక్తిపటం వద్ద పేర్ని కిట్టు


బలరామునిపేటలో సరస్వతీదేవిగా కాశీ అన్నపూర్ణాదేవి


కృత్తివెన్ను మండలం నీలిపూడిలో సరస్వతీదేవిగా


పెదకళ్లేపల్లిలో ప్రత్యేక అలంకారంలో దుర్గమ్మ


శ్రీరామపాదక్షేత్రంలో సరస్వతీదేవిగా..


చదువుల తల్లిగా కోడూరు గంగాభవాని


బందరు గీతామందిరంలో సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు

శర్వాణీ.. వీణాపాణి

అజ్ఞానమనే చీకటిని పారదోలి విజ్ఞాన కాంతి కిరణాలను వెదజల్లే జ్ఞానప్రదాయిని సరస్వతీ దేవి. శరన్నవరాత్రుల్లో బుధవారం సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. విద్యార్థులు సరస్వతీ నమస్తుభ్యం అంటూ శర్వాణికి పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా గోపూజలు, హోమాలు చేశారు.

–మచిలీపట్నంటౌన్/అవనిగడ్డ, నాగాయలంక/మోపిదేవి/ కోడూరు / ఘంటసాల/ పెడన/బంటుమిల్లి/కృత్తివెన్ను


సరస్వతీదేవి రూపంలో నాగాయలంక నగరేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి


నరసింహపురంలో పూజలు చేస్తున్న భక్తులు


గణపేశ్వరం దుర్గమ్మ సన్నిధిలో ..

సంక్షిప్త వార్తలు

పార్వతీదేవికి వెండి కవచం

పెడన: పట్టణంలోని శ్రీ గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ పార్వతీదేవికి బుధవారం భక్తులు వెండి కవచాన్ని బహూకరించారు. పోలవరపుపేటకు చెందిన మెట్ల మహేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య కమలకుమారి, కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భళ్ల ప్రసాద్, కమిటీ సభ్యులు, వార్డు కౌన్సిలర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

చిట్టూర్పులో మురళీ కోలాటం పోటీలు

చిట్టూర్పు(ఘంటసాల): దసరా సందర్భంగా ఘంటసాల మండలం చిట్టూర్పులో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి తాళం భజన, మురళీ కోలాటం పోటీలు 7వ రోజు బుధవారం ఆహ్లాదకరంగా సాగాయి. ఈ సందర్భంగా కొడాలి గ్రామానికి చెందిన శ్రీ కనకదుర్గ మహిళా మురళీ కోలాటం బృందం పోటీల్లో పాల్గొని భక్తి గీతాలకు చేసిన కోలాటం చేశారు. యార్లగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో యోగా నేర్చుకుంటున్న 26 మంది విద్యార్థులతో యోగాతో డ్యాన్స్ చేయించారు. కార్యక్రమంలో రైతు వేమూరి రత్నగిరి, సభ్యులు పాల్గొన్నారు.

లంకమ్మవారి ఆలయంలో చండీహోమం

అవనిగడ్డ: దసరా ఉత్సవాలు పురస్కరించుకుని స్థానిక లంకమ్మవారి ఆలయంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. మూలా నక్షత్రం పురస్కరించుకుని జరిగిన హోమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. ఉత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

పైపులైన్ల లీకులు అరికట్టండి

పెడన: పట్టణంలో తాగునీటి పైపులైన్ లీకులకు త్వరితగతిన మరమ్మతులు చేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మెయిన్ రోడ్డు చేపల మార్కెట్ మెయిన్ పైప్‌లైన్ లీక్ పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఏఈ కాగిత సీతారామాంజనేయులు, సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కోడూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కోడూరు పోలీసులు బుధవారం పట్టుకున్నారు. జరుగువానిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఎస్ఐ చాణిక్య తెలిపారు. ఉల్లిపాలెం వారధి సమీపంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద వీరిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఆటోలో, ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 700 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆటో, బైక్ సీజ్ చేసి, ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

కోడూరు: రొయ్యల చెరువుల వద్ద గడ్డి కోసేందుకు వెళ్లిన వ్యవసాయ కూలీ విద్యుత్ షాక్ గురై మృతిచెందిన ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ చాణిక్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జరుగువానిపాలెం గ్రామానికి చెందిన అప్పికట్ల పోతురాజు (48) మందపాకల శివారు చింతకోళ్ల గ్రామంలోని రొయ్యల చెరువుల గట్ల మేత కోసేందుకు గురువారం ఉదయం వెళ్లాడు. అక్కడ విద్యుత్ వైర్ తెగిపడి ఉండటంతో అది గమనించని పోతురాజు దాన్ని పట్టుకున్నాడు. విద్యుత్ షాక్‌కు గురై పోతురాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం తర్వాత పోతురాజు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

దొంగతనం కేసులో నగదు రికవరీ

బంటుమిల్లి: ముంజులూరు గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన దొంగతనం కేసులో పోలీసులు నిందితుడి నుంచి సొమ్ము రికవరీ చేసి కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన పామర్తి పాపారావు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి సుమారు 40 గ్రాముల బంగారు గొలుసులు ఎత్తుకెళ్లాడు. పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్ఐ గణేష్‌కుమార్‌కు నిందితుడు ఎదురుపడటంతో అనుమానం వచ్చి విచారణ చేయడంతో విషయం బయటపడింది. పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి పాపారావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి నుంచి బంగారు గొలుసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

పెడన: సారా కాస్తున్న వ్యక్తిని పట్టుకోవడమే కాకుండా 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు అందిన సమాచారంతో పెడనలోని 22వ వార్డు వైఎస్సార్ కాలనీలో గుడిసె ప్రశాంత్ సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో పెడన ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో దాడి చేశారు. ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు 30 లీటర్ల సారా, గ్యాస్ పొయ్యిలు, సిలిం